క్లుప్తంగా

## ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి



నృసింహస్వామి అలంకరణలో వేంకటేశ్వరస్వామి

మెంటాడ: స్థానిక శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని స్వామి వారు ప్రత్యేకాలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని, స్వామి వారిని నృసింహస్వామిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఏడాది పొడవునా భక్తులకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆలయ ప్రధానార్చకులు పీసపాటి కృష్ణమాచార్యులు స్వామి వారికి పూజలు చేశారు.

## ఘనంగా మంగమ్మ పేరంటాలు జాతర



బొద్దాంలో మంగమ్మతల్లి పేరంటాలుకు మొక్కులు చెల్లిస్తున్న ఉత్తరాంధ్ర రజకకుల సంక్షేమ సంఘ సభ్యులు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో మంగమ్మ పేరంటాలు జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రజకుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఘటాలు ఊరేగించి, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## రాజేష్‌కు జీఎంఆర్ అభినందన



పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్‌ను అభినందిస్తున్న జీఎంఆర్

రాజాం: వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కుటుంబ సమేతంగా రాజాం పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావు(జీఎంఆర్)ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎంఆర్ ఐటీ మైదానంలో పేదలకు వస్త్రదానం చేసేందుకు విచ్చేసిన జీఎంఆర్‌ను రాజేష్ కలిసి, తనకు ఇన్‌చార్జ్ పదవి వచ్చిన విషయాన్ని తెలిపారు. వెంటనే స్పందించిన జీఎంఆర్ రాజేష్‌ను అభినందించడంతో పాటు గతంలో జీఎంఆర్ కేర్ ఆస్పత్రిలో డాక్టర్‌గా రాజేష్ చేసిన సేవలను ప్రశంసించారు. ప్రజాసేవలో కూడా వెలుగొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవీలత, వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాభివృద్ధికి చందాల సేకరణ



చందాలు సేకరిస్తున్న యువకులు

రాజాం: మండలంలోని కంచరాం గ్రామంలో ప్రజా గ్రంథాలయ అభివృద్ధికి యువకులు చందాల సేకరణ మంగళవారం చేపట్టారు. చందాల ద్వారా వస్తున్న డబ్బులతో గ్రంథాలయ భవనం అభివృద్ధి చేయడంతో పాటు కొత్త పుస్తకాలు కొనుగోలు చేస్తున్నట్లు యువకులు తెలిపారు.

## ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి



రాజాం సిటీ: పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తి

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని చీపురుపల్లి డీఎస్పీ ఎ.శ్రీనివాస చక్రవర్తి అన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని, మున్సిపాలిటీ పరిధిలోని సారధి గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు కిల్లారి శ్రీనివాసరావు సమకూర్చిన దుస్తులను గ్రామంలోని పేదలకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా సహృద్భావ వాతావరణం నెలకొంటుందన్నారు. పేదల కుటుంబాల్లో సంతోషం చూసేందుకు తనకు ఉన్న దాంట్లో కొంతమొత్తం వెచ్చించి, సేవ చేస్తుండడాన్ని అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సుమారు 5 వేల మందికి దుస్తులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పొట్నూరు లక్ష్మణరావు, దూబ గోపాలం, ఫోరం ఫర్ బెటర్ రాజాం సభ్యులు మజ్జి మదన్‌మోహన్, వారాడ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సరదాల సంక్రాంతి

వాడవాడలా సంక్రాంతి, కనుమ సంబరాలు సోమ, మంగళవారం ఘనంగా నిర్వహించారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన రోజున సంక్రాంతి.. ఆ మరుసటిరోజు కనుమ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ సంప్రదాయ వస్త్రధారణలో మెరిశారు. యువతులు ముగ్గుల పోటీల్లో పాల్గొని, అందమైన రంగవల్లులు వేయగా, చిన్నారులు సరదాగా పతంగులు ఎగురవేశారు. ప్రతి ఇంట్లో కొత్త బియ్యంతో చేసిన పరమాన్నం పితృదేవతలకు నైవేద్యంగా సమర్పించారు. సుఖసంతోషాలతో జీవించేలా దీవించమని వేడుకున్నారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్.



వంగర: అరసాడలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు



వంగర: అరసాడలో ముగ్గులు పోటీలు



రాజాం: కంచరాంలో సంక్రాంతి సంబరాలు



రామభద్రపురంలో ఓ ఇంటి ముందు వేసిన ముగ్గులో గొబ్బెమ్మలు పెట్టి, ఆడుతున్న మహిళలు



సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో పితృదేవతలకు నైవేద్యం పెట్టి, పూజలు చేస్తున్న దృశ్యం



రేగిడి: అంబఖండిలో సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న గ్రామస్తులు



బాడంగి: ముగడ గ్రామంలో సంక్రాంతి వేడుకల్లో నాలుగు తరాల కుటుంబ సభ్యులు



తెర్లాం: సంక్రాంతి సందర్భంగా వెలగవలసలో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న గ్రామస్తులు



వంగర: కొప్పరలో గతేడాది పదో తరగతి ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం



రాజాం సిటీ: ఆకట్టుకున్న మహిళల కోలాటం

# ఇంటింటికీ 'అయోధ్య' అక్షతలు



రామభద్రపురంలో అయోధ్య రామమందిరం కరపత్రాలు, అక్షతలు పంపిణీ చేస్తున్న శ్రీరామ భక్తులు

వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో అయోధ్య రామమందిరం అక్షతలను ఇంటింటికీ మంగళవారం పంచిపెట్టారు. ఈ నెల 22వ తేదీన ఆలయ ప్రారంభోత్సవం పురస్కరించుకుని, రాముడికి పూజ చేసిన అక్షతలను పంపిణీ చేస్తున్నట్లు భక్తులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యలకల శ్రీనివాసరావు, యలకల వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేటలో అయోధ్య రామమందిరం అక్షతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ రాజన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత గ్రామంలో ఊరేగి, ఆలయ విశిష్టత, నిర్మాణం, ప్రారంభోత్సవం వివరాలను భక్తులకు తెలియజేశారు. అనంతరం రామాలయం వద్ద అక్షతలను పంచిపెట్టారు.

రామభద్రపురం: ఈ నెల 22వ తేదీన అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడి ఆలయంలో కొలువైన రాముడికి పూజలు చేసిన అక్షతలను ఇంటింటికీ మంగళవారం అందజేశారు. వీటిని ఇంట్లో కలుపుకున్న అక్షతలతో కలుపుకుని, పూజా కార్యక్రమాల్లో వినియోగించాలని భక్తులకు సూచించారు.



రేగిడి: మజ్జిరాముడుపేటలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షతల పంపిణీ



వంగర: ఇంటింటికీ వెళ్లి, అక్షతలు అందిస్తున్న దృశ్యం

## వస్త్రదానం



రేగిడి: లింగాలవలసలో పేదలకు వస్త్రదానం చేస్తున్న చిరంజీవినాయుడు

రేగిడి: మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన అదపాక చిరంజీవినాయుడు తన తల్లి సీతమ్మ జ్ఞాపకార్థం 400 మంది పేదలకు వస్త్రదానం చేశారు. గత పదేళ్లుగా లింగాలవలస, చినలింగాలవలస, తోకలవలస, వావిలవలస గ్రామాలకు చెందిన వృద్ధులు, వితంతువులకు కొత్తబట్టలు దానం చేస్తున్నట్లు దాత తెలిపారు.

## జోరుగా కోడిపందాలు



మెంటాడ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కోడిపందాలు

మెంటాడ: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని, మండలంలోని ఆగూరు, మెంటాడ, గుర్ల, పెదమేడపల్లి, చింతాడవలస గ్రామాల్లో కోడి పందాలు జోరుగా జరుగుతున్నాయి. రోజుకు రెండు పూటలా పందాలు జరుగుతున్నాయని, ఒక్క మంగళవారం రోజునే రూ.లక్షల్లో పందాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు.

# అ'పూర్వ' కలయిక



రామభద్రపురం: 2002-03 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

రామభద్రపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇదే స్కూల్‌లో చదువుకున్న 1997, 2002–03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని, సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు చప్ప సూర్యనారాయణ, ఎం.వి.రమణలను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

రాజాం: మండలంలోని బొద్దాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం జరిగింది. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుని, ఆనందంగా కాలం గడిపారు. అనంతరం ఇబ్బందుల్లో ఉన్న మిత్రులను ఆదుకునేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు వారు తెలిపారు.



రామభద్రపురం పాఠశాలలో కలుసుకున్న 1997 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



రాజాం: బొద్దాంలో కలిసిన 1993 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

### బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే

# సీఎం జగన్ అజెండా

రాజాం:

రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని కంచరాం గ్రామంలో విజయవాడలో ఈ నెల 19వ తేదీన జరిగే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించి, పోస్టర్ల పంపిణీ మంగళవారం చేపట్టారు. తొలుత ఆయన గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా సీఎం జగనన్న పాలన కొనసాగుతోందని, అన్నివర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు భారీగా ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, యూత్ అధ్యక్షుడు గెడ్డాపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రాజాం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

# క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వంగర:

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని ఓనెఅగ్రహారం గ్రామంలో కాబోతుల పార్వతి జ్ఞాపకార్థం నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఎమ్మెల్సీ చేతులమీదుగా మంగళవారం బహుమతులు అందజేశారు. పోటీల్లో ప్రథమ స్థానంలో ఉనుకూరు, ద్వితీయ స్థానంలో సంగాం, తృతీయ స్థానంలో శివ్వాం, నాలుగవ స్థానంలో గళావిల్లి జట్లు నిలవగా వీరికి నగదు బహుమతితో పాటు మెమొంటోలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ కాబోతుల శ్రీనువాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.



వంగర: విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

### కబడ్డీ విజేత లింగాపురం

సంతకవిటి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని సిరిపురం గ్రామంలో డోల రాములు జ్ఞాపకార్థం సందర్భంగా సోమవారం నిర్వహించిన కబడ్డీ పోటీల్లో లింగాపురం జట్టు ప్రథమ స్థానం సాధించి, విజేతగా నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో మామిడిపల్లి, సిరిపురం జట్లు నిలిచాయి. విజేత జట్లకు వరుసగా రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డోల తిరుపతి, పీడీలు కె.గణపతిరావు, కె.బుజ్జి, ఆర్.దినేష్ పాల్గొన్నారు.



తెర్లాం: అరసబలగలో ముగ్గుల పోటీలు



సంతకవిటి: విజేత జట్టుకు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

## అరసబలగలో ముగ్గుల పోటీలు

తెర్లాం: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని అరసబలగ గ్రామంలో సర్పంచ్ కొరగంజి సాయిరాం, గ్రామపెద్దల ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామానికి చెందిన మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొని, వివిధ రంగవళ్లులు వేసి, తమలోని ప్రతిభ కనబరిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఇదే గ్రామంలోని వృద్ధులు, దివ్యాంగులకు సర్పంచ్ దుస్తులు పంపిణీ చేశారు.

## ఘనంగా రామయ్య తండ్రి పండగ

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో కొత్తకోట కుటుంబీకుల ఇలవేల్పు రామయ్యతండ్రి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి కొత్తకోట కుటుంబీకులంతా పెద్దఎత్తున ఈ ఉత్సవానికి హాజరై, పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కొత్తకోట గోవిందరావు, మురళీకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.